మహిళా సాధికారతే సీఎం లక్ష్యం





వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా సంఘాల మహిళలు, మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు
- పలు పథకాలతో రూ.3.32 లక్షల కోట్ల లబ్ధి
- అధికార దాహంతోనే చంద్రబాబు అబద్ధపు హామీలు
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం వేలాదిమంది పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేశారు. అంతకు ముందు ఆయన మేయర్ శిరీష, కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 3648 కిలో మీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో నాలుగేళ్లలోనే 98 శాతం అమలు చేసిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. అధికారంలోకి రాగానే 2019కు ముందున్న డ్వాక్రా మహిళల రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తానని చెప్పి మాట నిలుపుకున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా కింద రూ.2.25 లక్షల కోట్లను అందజేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల కింద ప్రజలు రూ.3.32 లక్షల కోట్లను లబ్ధి పొందారని వివరించారు. తిరుపతిలో 3,328 పొదుపు సంఘాల మహిళలకు రూ.126 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశామన్నారు.

అధికార దాహంతోనే చంద్రబాబు అబద్ధపు హామీలు

అధికార దాహంతో వందల హామీలు ఇచ్చి తుంగలో తొక్కిన ప్రజాద్రోహి చంద్రబాబు అని ఎమ్మెల్యే భూమన మండిపడ్డారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తానని, సైకిళ్లు పంపిణీ చేస్తానని చెప్పడం తప్ప చేసిందేమీ లేదన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని ప్రగల్బాలు పలికారని, తన కుమారుడు లోకేష్‌కు మాత్రమే మంత్రి జాబ్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇచ్చిన దాఖాలు లేవన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్లు ఇచ్చి వారి సొంతింటి కలను సాకారం చేశారన్నారు. ఒక తిరుపతిలోనే 26 వేల మందికి ఇచ్చారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందిస్తున్నారని మేయర్ శిరీష తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచేయకుండా వైఎస్సార్ ఆసరా అందించి డ్వాక్రా సంఘాల మహిళల జీవితాలకు భరోసా కల్పిస్తున్నారని వివరించారు. కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతిలో 3,328 పొదుపు సంఘాల మహిళలకు రూ.126 కోట్లను వైఎస్సార్ ఆసరా కింద వారి ఖాతాల్లోకి జమ చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, కార్పొరేటర్లు కోటేశ్వరమ్మ, ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్, వరికుంట్ల నారాయణ, వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, నాయకులు రమణ, మహ్మద్‌రఫీ, మురళి, స్వరూప్, బాలకృష్ణ, రమణమ్మ, శారద, భాగ్యమ్మ, పార్వతమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- సమస్యల పరిష్కారానికి కృషి
- రైల్వే పెన్షనర్ల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి, అభినయ్‌రెడ్డి

తిరుపతి అర్బన్: రైల్వే ఉద్యోగులకు తాము అండగా ఉంటామని, వారి అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి నగరంలోని రైల్వే కాలనీలో నిర్మించిన రైల్వే పెన్షనర్ల నూతన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ తండ్రి రైల్వే ఉద్యోగి అని గుర్తుచేశారు. రైల్వే ఉద్యోగుల కష్టాలు తమకు తెలుసన్నారు. రైల్వే ఉద్యోగులతో పాటు, పెన్షనర్లకు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపుతామని వివరించారు. ఈ భవనంలో రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. భవనానికి కావలసిన ఫర్నిచర్‌కు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. మేయర్ శిరీష మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతి నగరం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. వారికి తోడుగా ఉంటానని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శ్రావణి మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, నారాయణ, అశోక్‌కుమార్‌రెడ్డి, దినేష్‌రాయల్, మురళీ యాదవ్, నాదముని, నాగిరెడ్డి, ధనుంజయులు, రాఘవులు నాయుడు, గౌతం పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వమూ ఇన్ని పథకాలు ఇవ్వలేదు

- డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి
- 3వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, పోయాయి. ఏ ప్రభుత్వమూ ఇన్ని పథకాలు అందించలేదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కార్పొరేటర్ తమ్ముడు గణేష్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి 3వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలు తమకు ఆసరాగా నిలిచాయని స్థానిక మహిళలు చెప్పడంతో సంతోషం వ్యక్తంచేశారు. రాబోయే ఎన్నికల్లో ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటామని చెప్పారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న నాలుగేళ్ల ప్రగతి ఎంతో మంది పేదల జీవితాలకు పురోగతినిచ్చిందన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో తాము ఏ గడపకు వెళ్లినా మీరు చల్లంగుండాలయ్యా అంటూ ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలోనూ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అందించడంతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆదం రాధాకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, బోకం అనీల్, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మాకం చంద్ర, సోమశేఖర్, మునిరెడ్డి, కుమార్, పాండు, రాజేష్, యమునమ్మ, శేఖర్‌రెడ్డి, ధనశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి పల్లెకూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- సాయినగర్, కుంట్రపాకం పంచాయతీల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



సాయినగర్‌లో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ మోహిత్ రెడ్డి, సర్పంచ్ డీవీ రమణ

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజల సంక్షేమంతో పాటు ప్రతి పల్లెకూ అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం సాయినగర్ పంచాయతీలో రూ.70 లక్షలతో సిమెంట్ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. కుంట్రపాకంలో రైతులకు అనువుగా రూ.10 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీపీ మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. కుల, మత, వర్గ, ప్రాంత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడేళ్లలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పల్లెల్లో చేస్తున్న అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గణపతి నాయుడు, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమనకు సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న తలారి రాజేంద్ర

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ ఇన్‌చార్జ్‌గా పదవి ఇచ్చిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని తలారి రాజేంద్ర తెలిపారు. ఆయన ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిని కలిసి సత్కరించారు. పార్టీలో కష్టపడే వారికి పదవులు వెతుకుంటూ వస్తాయనడానికి తానే నిదర్శనమని రాజేంద్ర తెలిపారు. పార్టీ అభ్యున్నతికి, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి గెలుపునకు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె. బాబు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, మధు, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రాజేష్, అరుణ, ఉష, సరస్వతి, హిమజ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవ బిల్లు చారిత్రాత్మకం



వెస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న చర్చి పెద్దలు

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రిస్టియన్లను దళితులుగా గుర్తించాలనే బిల్లును అసెంబ్లీలో ఆమోదించి పార్లమెంట్‌కు పంపడం చారిత్రాత్మకమని వెస్ట్ చర్చి ఫాదర్ రేవ్.జాన్సన్ తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం వెస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా తాము పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి గుర్తించి ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఈ ప్రయత్నం జరిగిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఆమోస్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన నిర్ణయాన్ని తీసుకోవడంతోపాటు దళితుల పక్షాన నిలిచిన గొప్ప మనసున్న ముఖ్యమంత్రి ఆంధ్ర రాష్ట్రానికి ఉండడం గర్వకారణమన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రెండు నెలల్లో కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తి

తిరుపతి తుడా: కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డును రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం అధికారులు, కార్పొరేటర్లతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొర్లగుంట రోడ్డు విస్తరణతో స్థానికుల ఇబ్బందులు తీరుతాయన్నారు. ప్రస్తుతం మురుగు కాలువ పనులు జరుగుతున్నాయని, మే నెల చివరి నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మోడ్రన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. భూగర్భ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇప్పటికే నగరంలోని ప్రధాన రోడ్ల వద్ద అండర్ కేబుల్ పనులు పూర్తయ్యాయన్నారు. కార్పొరేటర్లు పుల్లూరు అమర్నాథ్‌రెడ్డి, మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంకు డైరెక్టర్ జ్యోతిప్రకాష్, నాయకులు మాధవ, గోపి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

సీఎస్ఈ వర్క్ షాపు విజయవంతం

తిరుపతి తుడా : స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన సీఎంఈ వర్క్‌షాపు విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ మహిళల్లో అత్యంత సాధారణంగా సంభవించే బ్రెస్ట్ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మరణాలను తగ్గించవచ్చన్నారు.

మాపెల్స్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో ఏఎస్పీ విమలకుమారి, చిన్నారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎమ్మార్‌పల్లిలోని మాపెల్ స్కూల్లో ఆదివారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తులు ధరించి సందడి చేశారు. ముఖ్యఅతిథిగా ఏఎస్పీ విమలకుమారి హాజరై చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ



హుండీ వద్ద వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లిలో ముత్యాలమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుండగులు ఆలయం వెనుక వైపు నుంచి లోనికి ప్రవేశించి హుండీ తాళాలు పగలగొట్టి నగదు, గర్భాలయంలోని అమ్మవారికి అలంకరించిన తాళిబొట్లను చోరీ చేసినట్టు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఉదయం అమ్మవారికి పూజలు చేయడానికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్టు గుర్తించి ఆలయ ధర్మకర్తకు సమాచారం అందించారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారని, దుండగులను పట్టుకుంటామని పేర్కొన్నారు.

కారు బోల్తాపడి ముగ్గురికి గాయాలు



చంద్రగిరి/భాకరాపేట: తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి భాకరాపేట కనుమలో ఆదివారం సాయంత్రం కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన హరినాథ్, రేఖారాణి, కిరణ్ కుమార్ తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆదివారం కారులో బయలుదేరారు. భాకరాపేట కనుమలోని పెద్ద మలుపు దాటే క్రమంలో వర్షం కారణంగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది వారిని తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేరళకు చెందిన కేరళ నాట్యకళాలయం ఆధ్వర్యంలో నాట్య గురువు సుజాత రాధాకృష్ణన్ నేతృత్వంలో భరత నాట్యంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏకదంతాయ, శివ తాండవం, వేయి నామాల, ఢమరుకం, అయిగిరి నందిని, పౌర్ణమి, శివనామం, ప్రణవాలయ తదితర పాటలకు కళాకారులు మోహిత్ శ్రీ, జయశ్రీ, జాస్మిన్, నేశ్విక, హాసిని, సూర్య, హర్షిత, శివప్రియ, తనుశ్రీ అద్భుతంగా అభినయం చేశారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

జీయంగార్లు, భక్తులకు విసన కర్రల పంపిణీ



విసన కర్రలు అందజేస్తున్న హనుమంతరావు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న భక్తులు, జీయంగార్లకు చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్వాహకులు విసన కర్రలు పంపిణీ చేశారు. చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్ర నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సూర్యప్రభ వాహన సేవలో ప్రతి ఏటా అయ్యంగార్లు, భక్తులకు సుమారు 500 విసన కర్రలు అందజేస్తున్నామని తెలిపారు. కలకండ ప్రసాదం అందజేశారు. బీజేపీ నేత భక్తవత్సలం గీతామృతం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట గాయత్రి సేవా ట్రస్ట్ నిర్వాహకుడు సీఆర్‌కే.శేషగిరిరావు, లీలావతి, రవికుమార్ పాల్గొన్నారు.

దుర్గసముద్రంలో స్వచ్ఛభారత్ ర్యాలీ



స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి రూరల్: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డికుమార్ తెలిపారు. దుర్గసముద్రం పంచాయతీలో ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వీధులను శుభ్రం చేశారు. మురుగు కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

తుడా వెంచర్లో ఆక్రమణల తొలగింపు



తిరుపతి మంగళం: తిరుపతి అర్బన్ మండలం మంగళం సమీపంలోని తుడా లేఅవుట్ పరిధిలో నిర్మించిన ఇళ్లను తుడా అధికారులు ఆదివారం తొలగించారు. తమ ఇళ్లను అన్యాయంగా తొలగించారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తిరుమలనగర్ పంచాయతీలోని తుడా వెంచర్లో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం నగరంలోని రిక్షా కార్మికులకు 100 ప్లాట్లను కేటాయించిందని తెలిపారు. వాటిలోనే తాము ఇళ్లు నిర్మించుకున్నామని చెప్పారు. గతంలో ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లకు లబ్ధిదారులు డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేదని, వాటిని వేలం ద్వారా విక్రయించేందుకు తుడాకు అధికారం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే డబ్బు చెల్లించని ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సుమారు 20 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, ప్రభుత్వ ధర ఎంతో చెబితే తాము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని పలువురు స్థానికులు చెప్పారు.

క్లుప్తంగా

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ప్రభుత్వ విప్ ప్రసాద్ రాజు, ఎమ్మెల్యేలు వాసు బాబు, అన్నా రాంబాబు దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మహాప్రస్థాన ట్రస్ట్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



పాకాల: దామలచెరువులో ఏర్పాటుచేసిన మహాప్రస్థాన ట్రస్ట్ చంద్రగిరి ప్రాంతీయ కార్యాలయాన్ని ఆ ట్రస్టు గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం



కరుణ కాలనీలో ఆరోగ్య సర్వే చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రామచంద్రాపురం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు తెలిపారు. మండలంలోని సీరామాపురం పంచాయతీ కరుణ కాలనీలో ఆదివారం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి ఆరోగ్య సూత్రాలను వివరించారు. నీరు కలుషితమైతే కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శరవణ కుమార్ పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న డాక్టర్ వెంగమ్మ

తిరుపతి తుడా: కార్వేటినగరానికి చెందిన కుమారస్వామి గతంలో స్విమ్స్‌లో డయాలసిస్ చేసుకుంటూ మృతిచెందారు. ఆయనకు సిమ్స్ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీం ద్వారా రూ.50 వేలు మంజూరైంది. ఈ మేరకు చెక్కును ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు శ్రీ వేంకటేశ్వర ఏపీ స్టేట్ కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ అందజేశారు.

ఏప్రిల్ 3న చలో కలెక్టరేట్



మాట్లాడుతున్న కె.రాధాక్రిష్ణ

తిరుపతి కల్చరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 3వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ తెలిపారు. గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కె.కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో కూడా ప్రభుత్వాలకు విన్నవించినా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కరోనా భృతి కింద చెల్లిస్తామన్న రూ.10 వేలను వెంటనే ఇవ్వాలని కోరారు.

పచ్చిమేతతో అధిక పాల దిగుబడి

భాకరాపేట : వేసవి ప్రారంభిస్తున్న నేపథ్యంలో రైతులు పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని చిన్నగొట్టిగల్లు ఏడీఏ ఆవుల ప్రసాద్ తెలిపారు. వేసవిలో పచ్చిమేత వేయాలని, తద్వారా పాల దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. అవగాహన లోపంతో చాలా మంది రైతులు దాణాకే ఎక్కువగా పెట్టుబడి పెడుతున్నారని తెలిపారు. పశుగ్రాసం పెంపకం ద్వారా 60 నుంచి 70 శాతం దాణా ఖర్చులు తగ్గించవచ్చని చెప్పారు. పండ్ల తోటలు, దీర్ఘకాలిక పంటల మధ్య గ్రాసాన్ని అంతర పంటగా సాగు చేసుకోవచ్చని, నీటితో పాటు ఖర్చు కూడా తగ్గుందన్నారు. ఒక్కో పాడి పశువుకు రోజుకు 30 కిలోల పచ్చిగడ్డి, 5–6 కిలోల ఎండుగడ్డి అవసరం అవుతుందని తెలిపారు. ఒకే రకం కాకుండా పప్పుజాతి, ధాన్యం జాతి గ్రాసాన్ని పెంచుకోవాలని సూచించారు. తద్వారా అధిక పాల దిగుబడితో పాటు వెన్నశాతం ఎక్కువగా పొందే అవకాశాలుంటాయని వివరించారు.